సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



ఉత్సాహంగా ఎస్‌పీఎల్

సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో ఎస్‌పీఎల్ క్రికెట్ టోర్నీ ఉత్సాహంగా సాగుతోంది.

వివరాలు 18లో ▸



హంసవాహన సేవ

మన్యంకొండ బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామిని హంసవాహనంపై ఊరేగించారు.

వివరాలు 18లో ▸

గరిష్టం/కనిష్టం
32.1 /17.2

వాతావరణం

ఉదయం, రాత్రి సమయాల్లో చలి ప్రభావం పెరుగుతుంది. మధ్యాహ్నం పాక్షికంగా ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయ బదిలీలకు 1,785 దరఖాస్తులు

కందనూలు: టీచర్ల బదిలీల దరఖాస్తు గడువు ప్రక్రియ బుధవారం ముగిసింది. జిల్లాలో 3,171మంది ఉపాధ్యాయులు పాఠశాలలో విధులు నిర్వహిస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల కోసం దరఖాస్తుల ప్రక్రియ ముగిసే నాటికి 1785 మంది దరఖాస్తు చేసుకున్నారు. అనంతరం షెడ్యూల్ ప్రకారం దరఖాస్తుల హార్డ్ కాపీలను ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు హెచ్‌ఎంలకు అలాగే, ప్రాథమిక, ప్రాథమికోన్నత టీచర్లు ఎంఈఓలకు.. మండల పరిషత్ ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉపాధ్యాయులు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు.. హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డీఈఓకు సమర్పించాలి. హార్డు కాపీల దరఖాస్తులను ఈనెల 3 నుంచి 6 వరకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓలు.. డీఈవో కార్యాలయంలో సమర్పణ, పరిశీలన అనంతరం ఆమోదించనున్నారు.

భాషా పండితులకు ప్రమోషన్లు కల్పించాల్సిందే..

కందనూలు: భాషా పండితులకు ప్రమోషన్లు, బదిలీలు కల్పించాల్సిందేనని అప్పటి వరకు జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలలో గ్రేడ్–2గా పనిచేస్తున్న భాషా పండితులు తెలుగు, హిందీ, ఉర్దూ బోధనను నిలిపివేస్తున్నట్లు పలువురు చెప్పారు. రాష్ట్ర పండిత్ జేఏసీ పిలుపు మేరకు బుధవారం జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు వినతి పత్రాలను అందజేశారు. ఈసందర్భంగా పండిట్‌ల జేఏసీ నాయకుడు విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా భాషా పండితులు ప్రమోషన్లు లేకున్నా సర్వీస్‌లోనే పదవీ విరమణ పొందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2017లో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కానీ, కోర్టు కేసు సాకుగా చూపుతూ పండితులకు ప్రమోషన్లను నిలిపివేయడం శోచనీయమన్నారు. ఇందుకు నిరసనగా జిల్లా వ్యాప్తంగా అన్ని ఉన్నత పాఠశాలలో తెలుగు హిందీ ఉర్దూ బోధన నిలిపివేస్తున్నట్లు చెప్పారు. శ్రీనివాసులు ,శేఖర్ బాబు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

నాగర్‌కర్నూల్ క్రైం: విద్యార్థినులు, మహిళలపై వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ రామేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. వేధింపులకు గురైన వారు ధైర్యంగా షీటీంకు సెల్ నం. 7901099466, 8712657676లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యాలయాల్లో ఈవ్‌టీజింగ్ పై షీటీం బృందాలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

40% దృష్టి లోపం

జిల్లాలో కొనసాగుతున్న కంటివెలుగు కార్యక్రమం

- ఇప్పటివరకు 56,220 మందికి పరీక్షలు పూర్తి
- 16,759 మందికి కంటి అద్దాలు
- ఆపరేషన్ల సిఫారసులపై లెక్క తేల్చని అధికారులు



సాక్షి, నాగర్‌కర్నూల్: జిల్లాలో గత పదిహేను రోజులుగా కంటివెలుగు కార్యక్రమం కొనసాగుతోంది. జిల్లాకేంద్రంతో పాటు పట్టణాలు, గ్రామాల్లో విడతల వారీగా వైద్యసిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. జనవరి 19 నుంచి ప్రభుత్వం కంటివెలుగు కార్యక్రమాన్ని చేపట్టగా జిల్లాలో ఇప్పటివరకు మొత్తం 56,220 మందికి కంటిపరీక్షలు పూర్తయ్యాయి. జిల్లాలో నిర్వహిస్తున్న కంటి పరీక్షల్లో సుమారు 40 శాతం వరకు వివిధ రకాల దృష్టిలోపాన్ని ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 9,775 మందికి కేంద్రాల వద్దే రీడింగ్ అద్దాలను అందజేయగా, మరో 6,984 మందికి అవసరమైన ప్రిస్క్రిప్షన్ అద్దాలను పదిహేను రోజుల్లో ఇంటివద్ద పంపిణీ చేయనున్నారు.

16,759 మందికి కంటి అద్దాలు

ప్రభుత్వం చేపట్టిన కంటివెలుగు పరీక్షలకు మహిళలు ఎక్కువ శాతం హాజరవుతున్నారు. రెండోవిడత కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సుమారు 6 లక్షల మందికి కంటిపరీక్షలు నిర్వహించాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 56,220 మందికి స్క్రీనింగ్ పూర్తయింది. వీరిలో 29,221 మంది స్త్రీలు ఉండగా, 26,960 మంది పురుషులు, మరో 30 మంది థర్డ్ జెండర్లు కంటి పరీక్షలు పూర్తిచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లావ్యాప్తంగా 16,759 మందికి కంటి అద్దాలు అవసరం కాగా, వీటిలో అత్యధికంగా 9,775 మందికి దగ్గరి చూపు(రీడింగ్) అద్దాలను పంపిణీ చేశారు. వీరిలో 8,564 మంది 40 ఏళ్ల పైబడిన వారు కాగా, మరో 1,205 మంది 40 ఏళ్లలోపు యువత రీడింగ్ అద్దాలను వినియోగించాల్సి రావడం గమనార్హం. రానున్న రోజుల్లో కంటిపరీక్షల ద్వారా ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

జిల్లా వివరాలిలా..	
కంటి పరీక్షల లక్ష్యం	6 లక్షల మందికి
ఇప్పటివరకు పూర్తయింది	56,220 మంది
పురుషులు	26,960 మంది
స్త్రీలు	29,221 మంది
రీడింగ్ అద్దాలు అందజేత	9,775 మందికి
40 ఏళ్ల లోపువారు	1,205 మంది
40 ఏళ్లు పైబడినవారు	8,564 మంది
ప్రిస్క్రిప్షన్ అద్దాలు అవసరమైనవారు	6,984 మంది

కంటి ఆపరేషన్లపై సందేహాలెన్నో..

జిల్లాలో చేపడుతున్న కంటివెలుగు కార్యక్రమంలో కంటి అద్దాల పంపిణీకి మాత్రమే అధికారులు పరిమితమవుతున్నారు. కేంద్రాల వద్ద దగ్గరి చూపు అద్దాలను వెంటనే అందజేస్తుండగా, ప్రిస్క్రిప్షన్ అద్దాలను 15 రోజుల తర్వాత అంగన్‌వాడీల ద్వారా నేరుగా ఇంటికే పంపిస్తామని చెబుతున్నారు. అయితే గతంలోనూ నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో ఒకరికి సంబంధించిన అద్దాలను మరొకరికి తారుమారుగా పంపిణీ చేశారని, కొన్నిచోట్ల అద్దాలను పంపిణీ చేయలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈసారి అద్దాల పంపిణీ సక్రమంగా చేపట్టాలని కోరుతున్నారు. అలాగే శుక్లాలు, ఇతర కంటి సమస్యలకు కంటి ఆపరేషన్లు అవసరమైన వారి సంఖ్య ఎంతన్నదీ అధికారులు తేల్చడం లేదు. వారి వివరాలే లేనప్పుడు తర్వాత శస్త్రచికిత్సలు ఎలా నిర్వహిస్తారన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కంటి అద్దాలతో పాటు ఆపరేషన్లను సైతం సకాలంలో నిర్వహించాలని వారు కోరుతున్నారు.

రెండోసారి వచ్చాను..



గతంలో నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో పరీక్షించుకున్నాను. డాక్టర్లు అద్దాలు రాసి, ఇంటికే పంపిస్తామని చెప్పారు. కానీ వేరే వారికి ఇవ్వాల్సిన అద్దాలు నాకు పంపించడంతో పనిచేయలేదు. ఈసారి మళ్లీ చూపించుకున్నా. అధికారులు ప్రిస్క్రిప్షన్ అద్దాలు సక్రమంగా అందేలా చూడాలి.

– ఆనంద్, నాగర్‌కర్నూల్

ఆపరేషన్ చేయాలన్నారు..



నా కళ్లు సరిగ్గా కన్పించక పరీక్షల కోసం వచ్చాను. డాక్టరు చూసి కంటి ఆపరేషన్ చేయాలని చెప్పిండు. ఎప్పుడు చేస్తరో ఇంకా చెప్పలేదు. అద్దాలు పదిహేను రోజుల్లో ఇంటికి వస్తాయని చెప్పారు. ఆపరేషన్ కూడా త్వరగా చేస్తే బాగుంటది.

– సోఫియా బేగం, బీసీ కాలనీ, నాగర్‌కర్నూల్

ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆపరేషన్లు..



జిల్లావ్యాప్తంగా షెడ్యూల్‌వారీగా గ్రామాల్లో కంటివెలుగు పరీక్షలు నిర్వహిస్తున్నాం. అవసరమైన వారికి కంటి అద్దాలను ఉచితంగా అందిస్తున్నాం. కంటి ఆపరేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక మార్గదర్శకాల మేరకు నిర్వహిస్తాం. ఆపరేషన్ల అవసరమైన వారి వివరాలు సేకరిస్తున్నాం. 18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరు కంటివెలుగు పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి.

– సుధాకర్‌లాల్, డీఎంహెచ్‌ఓ

నాణ్యమైన విద్యనందించాలి

వెల్దండ: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించాలని, పిల్లల భవితకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు మన ఊరు–మన బడి, మనబస్తీ–మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జెడ్పీచైర్ పర్సన్ శాంతకుమారి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో మొదటి విడతలో రూ.26లక్షలతో చేపట్టిన వెల్దండ ఎంఆర్సీ ప్రాథమిక పాఠశాలను ఆమె ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలసి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ భూపతిరెడ్డి అధ్యక్షతను ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత మౌలిక వసతుల కల్పనలో దేశంలోనే మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యా, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. విద్యార్థులందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మీ భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. జిల్లాలోనే మొట్టమొదటిగా వెల్దండ పాఠశాలను ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ మన ఊరు–మన బడి పథకం కింద పాఠశాలల్లో పరిశుభ్రమైన త్రాగునీరు, టాయిలెట్ల నిర్మాణం, అదనపు తరగతి గదుల నిర్మాణం, మంచి లైటింగ్ సదుపాయం, భోజన వసతి ఏర్పాట్లు, గ్రీన్‌బోర్డులు, డిజిటల్ తరగతులకు అవసరమైన ఏర్పాట్లు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శాంతి, డీఈఓ గోవిందరాజులు, ఆర్‌అండ్‌బి ఈఈ భాస్కర్, తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంఈఓ శంకర్ నాయక్, ఎంపీడీఓ మోహన్‌లాల్ పాల్గొన్నారు.



వెల్దండలోని పాఠశాలను ప్రారంభిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్ శాంతకుమారి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ కసిరెడ్డి

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కల్వకుర్తి టౌన్: విద్యార్థులు వారికి వచ్చే అవకాశాలను అందిపుచ్చుకొని ముందుకు సాగాలని ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న అన్నారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మలబార్ గోల్డ్ ట్రస్టు వారు అందించే స్కాలర్‌షిప్ కార్యక్రమానికి జిల్లా ఇంటర్ అధికారి వెంకటరమణతో కలిసి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని దానిని సద్వినియోగ పరచుకోవాలన్నారు. విద్యార్థులు వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసి కొత్త ఆవిష్కరణలకు రూపాలను ఇవ్వాలన్నారు. నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు చాలా మంది విద్యకు దూరమవుతున్నారని, వారిని చదువుకు దూరం కాకుండా చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నామని మలబార్ గోల్డ్ ట్రస్టు చైర్మన్ జీశాన్, అజిత్ అన్నారు. అనంతరం కళాశాలలో చదువుతున్న 200 మంది విద్యార్థులకు రూ.16 లక్షల రూపాలయలను వారి ట్రస్టు ద్వారా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు సురేందర్ రెడ్డి, సంజీవరెడ్డి, శ్రీనివాస్, మాధవి, కల్వకుర్తి కళాశాల లెక్చరర్లు వేణు, భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

220మంది వధూవరులకు పట్టువస్త్రాలు

కందనూలు: ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వచ్చేనెల 12వ తేదీన జరిగే సామూహిక కల్యాణ మహోత్సవంలో ఒక్కటయ్యే 220 మంది వధూవరులకు, అలాగే వారి తల్లిదండ్రులకు ట్రస్ట్ అధినేత, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, పట్టువస్త్రాలు పంపిణీ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు సేవ చేయాలనే లక్ష్యంతో మా నాన్న పేరు మీద ఎంజేఆర్ చారిటబుల్ ట్రస్ట్ స్థాపించినని, ఆయన స్ఫూర్తితో ప్రతి ఏడాది ఈ సామూహిక వివాహాలు చేస్తున్నామని అని చెప్పారు. ఈ ఏడాది 220 పైగా మంది జంటలకు వివాహాలు చేస్తున్నామని, అందరూ ట్రస్ట్ సూచనలను పాటించాలని ఆకాంక్షించారు. రాబోయే కాలంలో మా ట్రస్ట్ సేవలను విద్య,వైద్యం పైన కూడా దృష్టి పెడుతున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రతి జంటకుముత్యాల పందిరి వేస్తున్నామని, ఓ పురోహితుడిని ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.



వధూవరులకు పట్టువస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు ఇవ్వాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఇంటి స్థలం ఉన్న ప్రతిపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గం పర్వతాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని బీసీ కాలనీలో సర్వే నిర్వహించారు. ప్రభుత్వం ఈ నెల ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించి అర్హులందరికీ రూ.3 లక్షలు ఇవ్వాలని, జిల్లా కేంద్రంలో నిర్మించిన డబల్ బెడ్‌రూం ఇండ్లను త్వరితగతిన పూర్తిచేసి పంపిణీ చేయాలన్నారు. ఆర్ శ్రీనివాసులు, గీత, కాశన్న, అశోక్, ఈశ్వరమ్మ, నర్సింహా, బాలు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

- జిల్లాకు ప్రత్యేక కేటాయింపులు కరువు
- 'పాలమూరు–రంగారెడ్డి'కి మళ్లీ మొండిచేయి
- జాతీయ హోదా ఊసే ఎత్తకపోవడంపై విమర్శలు
- ఊసేలేని జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల ఏర్పాటు
- వ్యవసాయరంగానికి పెద్దపీట, వేతన జీవులకు ఊరటపై హర్షం

మోదం.. ఖేదం




సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై జిల్లావాసులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ రంగానికి పెద్దపీట వేయడం.. పన్ను పరిమితి పెంపుతో వేతన జీవులకు ఊరట... ఇలా సామాన్య, మధ్య తరగతి వర్గాలకు ప్రయోజనం చేకూరేలా చేసిన ప్రతిపాదనలపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఉమ్మడి పాలమూరు జిల్లాకు తగిన ప్రాధాన్యం దక్కలేదని.. ఎంపీల ప్రతిపాదనలకు మోక్షం లభించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉమ్మడి పాలమూరు జిల్లాతో పాటు రంగారెడ్డి జిల్లాల్లో 12.30 లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసేలా రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదాపై బడ్జెట్‌లో ఊసే లేకుండా పోయింది. అదే సమయంలో కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుతో పాటు ఆ రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాలకు రూ.5వేల కోట్లు కేటాయించడంపై రాజకీయ వర్గాలు ఎన్నికల బడ్జెట్‌గా అభివర్ణిస్తున్నాయి. సామాన్య, మధ్య తరగతి వర్గాలకు అనుకూలమైన బడ్జెట్ అని బీజేపీ వర్గాలు అభిప్రాయపడుతుండగా.. నిరుద్యోగం అంశం ప్రస్తావనే లేదని, ఉపాధి హామీకి కోత అశనిపాతం అంటూ విపక్షాలు విమర్శిస్తున్నాయి.

స్క్రాపేజీ పాలసీ ఏప్రిల్ నుంచి అమలు..

బడ్జెట్ 2021–22లో ప్రవేశపెట్టిన వెహికిల్ స్క్రాపేజీ పాలసీకి ఈ బడ్జెట్‌లో అదనంగా నిధులు కేటాయించారు. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు క్లీన్–ఎనర్జీ వాహనాల అమ్మకాలను పెంచడంలో భాగంగా 15 ఏళ్ల కంటే పాత వాహనాలను దశలవారీగా తొలగించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచే అమల్లోకి రానున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో వేలాదిగా వాహనాలు చెత్తకుప్పలకు తరలనున్నట్లు తెలుస్తోంది.

గద్వాల–మాచర్ల, కృష్ణా–వికారాబాద్ రైల్వే లేన్ల ప్రతిపాదనలకు ఈసారి కూడా మోక్షం లభించనట్లు తెలుస్తోంది. దీంతో పాటు మక్తల్, ఊట్కూరు, నారాయణపేట, అభంగపూర్, మద్దూర్, కోస్గి, సర్జఖాన్‌పేట మీదుగా దోమ, పరిగి, నుంచి వికారాబాద్ వరకు సంబంధించి కృష్ణా–వికారాబాద్ రైల్వే లేన్‌కు పలుమార్లు సర్వేలు పూర్తయినప్పటికీ కేంద్రం గత ఏడాదిలాగే నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యకు సంబంధించి జవహర్ నవోదయ, కేంద్రీయ విద్యాలయాలు, సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై ఈసారి బడ్జెట్‌లో సైతం ప్రాధాన్యం దక్కలేదని విద్యారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. నారాయణపేట శివారు ఎక్లాస్‌పూర్‌లో 50ఎకరాల స్థలాన్ని సైనిక్ స్కూల్‌కు కేటాయించగా.. గత బడ్జెట్‌లో మొండిచేయే చూపారు. చివరకు ఈ బడ్జెట్‌లో సైతం నిధులు కేటాయించకపోవడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. కాగా మహబూబ్‌నగర్–చించోళి, కల్వకుర్తి–కొల్లాపూర్ జాతీయ రహదారులకు, కృష్ణా–దేవరకద్ర మార్గానికి ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిగినట్లు తెలుస్తోంది.

విద్య, రైల్వేరంగానికి మొండిచేయి



వ్యవసాయానికి పెద్దపీట..

కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు రూ.20 లక్షల కోట్ల వ్యవసాయ రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. అదేవిధంగా వ్యవసాయ స్టార్టప్‌లకు చేయూత, ప్రత్యేకనిధి ఏర్పాటు, పత్తి సాగు మెరుగుదలకు ప్రత్యేక చర్యలు, మార్కెటింగ్ సదుపాయం, ఆత్మ నిర్భర్, భారత్ క్లీన్ పథకం, ఉద్యానపంటలకు చేయూత, చిరుధాన్యాల సాగుకు సహకారం, డెయిరీ, పీఎం మత్స్య సంపద యోజనకు అదనపు కేటాయింపులు, పంట ఉత్పత్తుల నిల్వకు గిడ్డంగుల నిర్మాణం, సేంద్రియ వ్యవసాయానికి ప్రోత్సాహం, రైతులకు బయో ఇన్‌పుట్స్ రిసోర్స్ కేంద్రాలు, వ్యవసాయ అభివృద్ధికి ప్రత్యేకనిధి, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పెంపు చేయనున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా ఎస్టీలకి ప్రత్యేక నిధులు, విశ్వకర్మ యోజన పథకాలు సామాన్యులకు మేలు చేస్తాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రాష్ట్రంపై చిన్నచూపు..



కేంద్రం తన బడ్జెట్‌లో మరోసారి రాష్ట్రంపై చిన్నచూపును ప్రదర్శించింది. ప్రధానంగా బడ్జెట్‌లో రైతుల ప్రస్తావన కరువైంది. గ్రామీణఅభివృద్ధికి నిధులు తగ్గిస్తూ, ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కేంద్రం కుట్ర పన్నినట్టు స్పష్టమవుతోంది. సాగునీటి ప్రాజెక్టులు, డ్యాం నిర్మాణాలతో వ్యవసాయ రంగం అభివృద్ధి చెందుతుంది తప్ప డిజిటల్ అగ్రికల్చర్ లాంటి విధానాలతో కాదు.

– గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు

ఇది నిరుపేదల బడ్జెట్



కేంద్రం ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరుపేదలు, సామాన్యులకు మేలు చేస్తుంది. బడ్జెట్‌లో ప్రధానంగా విద్య, నైపుణ్యాలకు అధిక ప్రాధాన్యం కల్పించారు. నవీన పద్ధతుల్లో ఉపాధ్యాయులకు శిక్షణనివ్వనున్నారు. రానున్న రోజుల్లో పీఎం కౌశల్ వికాస్ యోజన 4.0 పథకం ద్వారా యువత సాధికారత, ఉద్యోగాల కల్పనకు కేంద్రం కృషిచేయనుంది.

– ఎల్లేని సుధాకర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

అదానీ, అంబానీల బడ్జెట్..



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజావ్యతిరేక బడ్జెట్‌గా పరిగణిస్తున్నాం. ప్రధానంగా అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ వ్యక్తుల కోసం బడ్జెట్ కేటాయింపులు చేసినట్టుగా కన్పిస్తోంది. గ్యాస్, పెట్రోల్‌తో సహా అన్ని రకాల నిత్యవసర సరుకుల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న సామాన్యులకు ఈ బడ్జెట్ ఏమాత్రం ఉపశమనం కల్గించలేదు.

– డాక్టర్ వంశీకృష్ణ, డీసీసీ అధ్యక్షుడు

సామాన్యుల గోడు పట్టని బడ్జెట్..



కేంద్ర బడ్జెట్‌లో పేదలు, సామాన్య ప్రజలకు మేలు చేసే కొత్త విషయాలు లేవు. నిత్యవసర సరుకుల ధరలపై పన్ను తగ్గింపులు లేకపోవడంతో సామాన్యులపై భారం తప్పడం లేదు. ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గించడంతో గ్రామాల్లో కూలీల పని దినాలు మరింత తగ్గే అవకాశం ఉంది.

– కాణాపురం ప్రవీణ్, నాగర్‌కర్నూల్

పేదలు కాదు పెద్దోళ్ల బడ్జెట్



కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ నూటికి నూరుశాతం పెద్దోళ్ల బడ్జెట్. ఈ బడ్జెట్‌లో పేదల సంక్షేమం ఊసే లేదు. పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు లబ్ధిచేకూరేలా బడ్జెట్ కేటాయింపులు జరిగాయి. ఉత్పాదక వస్తువులపై పన్నులు పెంచడం వల్ల భవిష్యత్తులో వినియోగదారులపై ఆర్థికభారం పడే అవకాశం ఉంది. రైతుల సంక్షేమం గూర్చి ఏమాత్రం పట్టించుకోలేదు. ఆభరణాలు, మహిళల వస్తు సామగ్రిపై కూడా పన్నుల భారం మోపడం ఈ ప్రభుత్వానికే చెల్లుతుంది.

– బాల్‌నర్సింహ్మ, సీపీఐ రాష్ట్ర నాయకులు, కొల్లాపూర్

సామాన్యుల సాధికారతకు దోహదం



బడ్జెట్ అన్ని వర్గాలకు మేలు చేసేదిగా ఉంది. ముఖ్యంగా సామాన్యులకు ఉచిత బియ్యాన్ని కొనసాగించడం, గృహ వసతిని కల్పించడం, సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.2.5లక్షలు ఇవ్వడానికి నిర్ణయించడం, రూ.75వేల కోట్లకు పెంపు, యువతకు కౌశల్ శిక్షణ, వ్యవసాయానికి రూ.20 లక్షల కోట్ల రుణా లు, శ్రీ అన్న పథకం ద్వారా చిరుధాన్యాల రైతు లకు ప్రోత్సాహం వంటి ఎంతో మేలుచేసేదిగా ఉన్నాయి. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారా మన్,ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు..

– బుసిరెడ్డి సుధాకర్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు, నాగర్‌కర్నూల్

దళితుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏదీ..?

దళిత, బహుజనుల సంక్షేమానికి బడ్జెట్‌లో కేంద్రం ప్రాధాన్యం ఇవ్వలేదు. వారి అభ్యున్నతికి కేటాయించిన నిధులే ఇందుకు నిదర్శనం. ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం పట్ల కేంద్రానికి చిత్తశుద్ధి లేదు. ఉపాధి పనులకు కోతలు విధించి కూలీలను కూడా రోడ్డున పడేసేలా చేస్తున్నారు. బీజేపీ నేతలు ఈ అంశాలను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లాలి.

– యాదగిరి మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు, కొల్లాపూర్

వేతన జీవుల అసంతృప్తి



ఆదాయపు పన్ను మినహాయింపు పరిమితిని స్వల్పంగా పెంచి, మధ్యతరగతి వేతన జీవులకు భారీ ఊరట పేరుతో ప్రచారం చేసుకోవటం సమంజసం కాదు. పాత, కొత్త పన్ను విధానాలను కొనసాగిస్తూ క్రమంగా పాత పన్ను విధానాన్ని ఎత్తివేయటానికే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్లు ఈ బడ్జెట్ ద్వారా స్పష్టమైంది. బడ్జెట్ ద్వారా ధరలు ఏమాత్రం తగ్గే అవకాశం లేదు. గృహ నిర్మాణానికి ప్రోత్సాహం లేదు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించిన బడ్జెట్ సగటు వేతన జీవులకు ఏమాత్రం సంతృప్తినివ్వలేదు.

– కృష్ణ, జిల్లా అధ్యక్షుడు, టీఎస్ యూటీఎఫ్

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మక్తల్: పొలంలో నీళ్లు పెడుతున్న సమయంలో విద్యుత్‌వైర్లు తెగిపడి యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని టేకులపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రవి (22) తన పొలంలో వేరుశనగ పంటలకు నీళ్లు పెడుతున్న సమయంలో అదే పొలంలో ఉన్న విద్యుత్ మోటార్‌కు వేసిన వైర్లు తెగి యువకుడిపై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

వివాహిత మృతి

లింగాల: ఇంటి నుంచి వెళ్లిన వివాహిత మహ్మద్ నజియా బేగం(25) వ్యవసాయ బావిలో శవమై కనిపించిన సంఘటన బుధవారం మండలంలోని కోమటికుంటలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు కొన్నేళ్ల నుంచి మతిస్థిమితం లేక తిరుగుతూ వస్తుందని, చాలా సార్లు కుటుంబ సభ్యులు వెతికి ఇంటికి తీసుకుచ్చారు. మూడు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన ఆమె గురించి పలు ప్రాంతాలలో బంధువుల ఇళ్లలో వెతికినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. గ్రామ శివారులో బావి వద్ద రైతు మోటారు ఆన్ చేసేందుకు వెళ్లగా, మృతదేహం కనిపించడంతో నజియాబేగంగా గుర్తించారు. మృతురాలికి భర్త మహ్మద్ పాష, ముగ్గురు సంతానం ఉన్నారు. సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

మక్తల్: గుర్తుతెలియని మహిళ మృతి చెందిన సంఘటన పట్టణంలో మల్లికార్జున ఆలయ సమీపంలో చోటుచేసుకుంది. కుర్మన్నకుంటలో మహిళ మృతదేహం కనబడడంతో స్థానికులు మున్సిపాలిటీ సిబ్బందికి సమాచారం అందించారు. 2వ వార్డు అధికారి మహదేవప్ప మక్తల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

నిప్పంటుకుని మహిళకు గాయాలు

గండేడ్: వంట చేస్తుండగా ప్రమాదవ శాత్తు చీరకు నిప్పంటుకుని ఓ మహిళ గాయపడింది. మండలంలోని జంగంరెడ్డిపల్లి చెందిన మొగులమ్మ(60) ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంట చేస్తుంది. బుధవారం పాఠశాలలో వంట చేస్తుండగా చీరకొంగుకు నిప్పంటుకుంది. మంటలు ఒంటికి అంటుకోవడంతో గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు మహబూబ్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

హత్యాయత్నంపై కేసు నమోదు

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఆవంచలో కాల్వ నీటిని చెరువులోకి మళ్లించేందుకు వెళ్ళిన రైతు దశరథ్‌రెడ్డిని అదే గ్రామానికి చెందిన కొందరు తాళ్లతో కట్టేసి నోట్లో పురుగు మందు తాగించి హత్యాయత్నానికి పాల్పడిన ఘటనపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ షేక్ శంషోద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దశరథ్‌రెడ్డి మంగళవారం రాత్రి కాల్వ నీటిని చెరువులోకి మళ్లించేందుకు వెళ్లాడు. అదే మార్గం గుండా వచ్చిన కొందరు పట్టుకుని కాళ్లు కట్టేసి నోట్లోకి పురుగు మందు తాగించి వాళ్లే గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. వెంటనే గ్రామస్తులు ఘటనా స్థలికి చేరుకుని జడ్చర్లలోని ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. భర్త తెలిపిన విషయాలను భార్య జయమ్మ గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి మరికొందరిపై ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టి తక్షణమే చర్యలు తెలిపారు.

వివాహిత అదృశ్యం: కేసు నమోదు

గోపాల్‌పేట: మండలంలోని చెన్నూరు చెందిన శివకు, ఘనపురం మండలం పర్వతాపురం చెందిన రాధికతో రెండేళ్ల క్రితం వివాహమైంది. మంగళవారం శివ పనికి వెళ్లి మధ్యాహ్నం ఇంటి వద్ద భోజనం చేసేందుకు వచ్చాడు. ఇంటి వద్ద భార్య కనిపించకపోవడంతో తల్లితండ్రులకు సమాచారం అందించి బంధువులు, తెలిసిన వారిని ఆరా తీయగా ఎక్కడా లేదని తెలిసింది. దీంతో బుధవారం తిరుపతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

సారా అమ్మిన మహిళకు జరిమానా

అచ్చంపేట రూరల్: సారాను తరలిస్తూ రెండోసారి పట్టుబడ్డ మండలంలోని నక్కెర్లపెంటకు చెందిన మూడావత్ మత్రికి రూ.50వేలు జరిమానాను తహసీల్దార్ కృష్ణయ్య విధించారు. సంవత్సరం లోపు రెండోసారి సారా తరలిస్తూ బుధవారం ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా జరిమానా విధించారు. జరిమానా డబ్బులను ప్రభుత్వ ఖజానాలో జమ చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు.

ఎక్సైజ్ పోలీసుల దాడులు

బల్మూర్: మండలంలోని కొండనాగుల, అంబగిరిలో బుధవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ మహబూబ్‌నగర్, అచ్చంపేట ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. రెండు గ్రామాల్లో భూమిలో దాచి ఉంచిన 150 లీటర్ల బెల్లం పానకంను గుర్తించి పారబోశారు. 20కేజీల నల్లబెల్లం, 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. రెండు కేసులు నమోదు చేశారు.

ఉత్సాహంగా ఎస్‌పీఎల్ మ్యాచ్‌లు


బ్యాటింగ్ చేస్తున్న డీఎస్పీ మహేష్


జూనియర్ ఫైనల్‌కు చేరడంతో సంబరాలు చేసుకుంటున్న 'కొట్టం' జట్టు

హోరాహోరీగా సాగిన జూనియర్స్ సెమీఫైనల్

- ఫైనల్‌కు చేరిన కొట్టం కళాశాల జట్టు
- నేటి నుంచి సీనియర్ విభాగం పోటీల ప్రారంభం

మహబూబ్‌నగర్ క్రీడలు: సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రం పిల్లలమర్రి సమీపంలో ఎండీసీఏ మైదానంలో ఎస్‌పీఎల్ (సాక్షి ప్రీమియర్ క్రికెట్ లీగ్) ఉత్సాహంగా జరుగుతోంది. జూనియర్ విభాగం పోటీలు ముగింపు దశకు చేరుకోగా గురువారం నుంచి సీనియర్ విభాగం పోటీలు ప్రారంభంకానున్నాయి. జూనియర్స్ విభాగంలో బుధవారం హోరాహోరీగా సాగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో కొట్టం జూనియర్ కళాశాల జట్టు ఆరు వికెట్ల తేడాతో పాలమూరు ఐటీఐ కళాశాల జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన పాలమూరు ఐటీఐ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. జట్టులో అద్నాన్ (27 బంతుల్లో 9 ఫోర్లు కొట్టి 51 నాటౌట్) లీగ్‌లో తొలి అర్ధసెంచరీ చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కొట్టం జట్టు చివరి వరకు ఉత్కంఠను కొనసాగిస్తూ..9.5 ఓవర్లలో 4 వికెట్లకు 92 పరుగులు చేసింది. జట్టులో షాకీబ్ 33 పరుగులు చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అద్నాన్ (పాలమూరు ఐటీఐ) నిలిచాడు.

జేపీఎన్‌సీపై ప్రభుత్వ కళాశాల విజయం

అంతకుముందు రెండో రోజు మొదటి లీగ్ మ్యాచ్‌లో ప్రభుత్వ బాలుర కళాశాల జట్టు


పాలమూరు ఐటీఐ- వాగ్దేవి కళాశాల మ్యాచ్‌లోని దృశ్యం

59పరుగుల తేడాతో జేపీఎన్‌సీ-2 జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ బాలుర కళాశాల నిర్ణీత 10 ఓవర్లలో వికెట్ కోల్పోయి 114 పరుగుల భారీ స్కోర్ చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జేపీఎన్‌సీ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లకు 55 పరుగులు చేసింది. ప్రభుత్వ కళాశాల బౌలర్ ముఖిత్ 3 వికెట్లు తీశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా అభి నిలిచాడు.

■ రెండో లీగ్ మ్యాచ్‌లో పాలమూరు ఐటీఐ కళాశాల 6 వికెట్ల తేడాతో వాగ్దేవి జూనియర్ కళాశాల-2పై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన వాగ్దేవి నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లకు 78 పరుగులు చేసింది. జట్టులో షాదాబ్ 36 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పాలమూరు ఐటీఐ 9 ఓవర్లలో 4 వికెట్లకు 80 పరుగులు చేసింది. శివ 39 పరుగులు చేసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

■ మూడో మ్యాచ్‌లో కొట్టం జూనియర్ కళాశాల జట్టు 43 పరుగుల తేడాతో ప్రతిభా జూనియర్ కళాశాల-2 జట్టుపై గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన కొట్టం కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లకు 103 పరుగులు చేసింది. సంతోష్ అజేయంగా 44 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రతిభ కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 60పరుగులు చేసింది. సంతోష్ (కొట్టం జట్టు) మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్నాడు.

■ నాలుగో మ్యాచ్‌లో ప్రతిభాకళాశాల-1 జట్టు 27 పరుగుల తేడాతో ప్రభుత్వ ఒకేషనల్ కళాశాల జట్టుపై విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన ప్రతిభా కళాశాల జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 96 పరుగులు చేసింది. ఆశిష్ 31 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన ప్రభుత్వ ఒకేషనల్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లకు 69 పరుగులు చేసింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఆశిష్ (ప్రతిభ కళాశాల) నిలిచాడు.

డే-2 (మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్)


అభి (ప్రభుత్వ బాలుర కళాశాల)


శివప్రసాద్ (పాలమూరు ఐటీఐ)


సంతోష్ (కొట్టం కళాశాల)


ఆశిష్ (ప్రతిభా కళాశాల-1)


అద్నాన్ (పాలమూరు ఐటీఐ)

టోర్నీలతో క్రీడాకారుల ప్రతిభ వెలుగులోకి.. : డీఎస్పీ మహేష్

క్రీడా టోర్నీలతో క్రీడాకారుల్లో దాగివున్న ప్రతిభ వెలుగులోకి వస్తుందని డీఎస్పీ మహేష్ అన్నారు. బుధవారం సాక్షి ప్రీమియర్ లీగ్ రెండో మ్యాచ్‌లను డీఎస్పీ మహేష్ ప్రారంభించారు. అనంతరం బ్యాటింగ్ చేసి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ క్రీడల్లో ఆడుతున్నట్లు తెలిపారు. సాక్షి ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో క్రికెట్ లీగ్ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సాక్షి యూనిట్ బ్రాంచ్ మేనేజర్ శ్యాంసుందర్, బ్యూరో ఇన్‌చార్జ్ కిషోర్‌కుమార్, ఎడిషన్ ఇన్‌చార్జ్ హరిప్రసాద్, సాక్షి సిబ్బంది కురుమయ్య, మాణిక్‌రావు, పరమేష్, రామస్వామి, రవి, సాబేర్, పీఈటీ అబ్దుల్లా, కోచ్ ఎండీ మన్నాన్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌పీఎల్‌కు స్పాన్సర్‌గా సుధాకర్ పీవీసీ వ్యవహరిస్తున్నారు. పంచవటి ఆస్పత్రి యాజమాన్యం వారు క్రికెట్ మైదానంలో అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.

స్థలం ఇస్తే ఇండోర్ స్టేడియం నిర్మిస్తాం

- మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్
- అలంపూర్‌లో ఆర్యవైశ్య కల్యాణ మండపం ప్రారంభం


టీజీ వెంకటేష్‌ను సన్మానిస్తున్న మహిళలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ పట్టణంలో ఆర్యవైశ్యులు రూ.2కోట్లతో నిర్మించిన వాసవి ఆర్యవైశ్య కల్యాణ మండపాన్ని బుధవారం మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాలు విభజన అయినా మానవ సంబంధాలు ఎప్పటికీ ఆత్మీయతతో నిలిచి ఉంటాయన్నారు. కల్యాణ మండపం ఇక్కడి ప్రజలకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. గతంతో తాను ఇక్కడి ఆస్పత్రికి స్థలం ఇచ్చిన విషయం గుర్తు చేశారు. గతంలో ఇండోర్ స్టేడియంకు కూడా తాను హామీ ఇచ్చానని, అయితే ఇప్పటి దాకా స్థలం చూయించలేదన్నారు. ఇప్పటికైనా స్థలం ఇస్తే తాను ఇండోర్ స్టేడియం కట్టి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. అదే విధంగా జోగుళాంబ దేవస్థానం వారు ఆర్కియాలజికల్ వారితో అనుమతులు ఇప్పిస్తే శ్రీశైలం తరహాలో ముఖ ద్వారం ఏర్పాటు చేస్తామన్నారు. ఆర్య వైశ్య వాసవి కల్యాణ మండపం అధ్యక్షుడు రవిప్రకాష్, సురేష్, లక్ష్మి ప్రసాద్, సతీష్, ఫణిభూషన్, కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు. అనంతరం టీజీ వెంకటేష్ జోగుళాంబ ఆలయనికి దర్శించకున్నారు.

నేటి నుంచి భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


విద్యుద్దీపాలంకరణలో ఆలయ ప్రాంగణం

- వేడుకలకు మంత్రాలయ పీఠాధిపతి రాక


భూలక్ష్మీ చెన్నకేశవ స్వామి

గద్వాల: జిల్లా కేంద్రంలోని కోటలో వెలసిన భూలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. వారం రోజుల పాటు ఈ వేడుకలు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మఠం ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. 14 ఏళ్ల క్రితం గద్వాల కోటలోని ఆలయ పరిసర ప్రాంతాలు, బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను మంత్రాలయ మఠానికి అప్పగించారు. గద్వాల పెద్ద జాతరగా పిలువబడే చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల ప్రాంతాలతోపాటు కర్ణాటక చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని కొలుస్తారు. జమ్ములమ్మ ఉత్సవాలు ప్రారంభం కావడంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఈనెల 2వ తేదీ నుంచి 8 తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 3న కల్యాణోత్సవం, 5వ తేదీ అర్ధరాత్రి రథోత్సవం ఉంటుంది. రథోత్సవ కార్యక్రమానికి, అంతకు ముందు పూజా కార్యక్రమాలు మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థ శ్రీపాదుల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. ఉదయం నుంచి రాత్రి వరకు మంత్రాలయ పీఠాధిపతి హోమాలు, విశేష పూజలు చేస్తారు. లింగంబావిలో తెప్పోత్సవం నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

మద్యానికి బానిసై చోరీలు

- నలుగురి రిమాండ్
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నర్సింహ


భూత్పూర్‌లో వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ నర్సింహ

భూత్పూర్: తాగుడుకు బానిసైన యువకులు చోరీలు చేస్తుండగా, పోలీసులు వారిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు. అందుకు సంబంధించిన వివరాలను బుధవారం ఎస్పీ నర్సింహ సీఐ కార్యాలయంలో వెల్లడించారు. మండలంలోని కొత్త మొల్గర చెందిన రాజమల్లేష్ గత నెల 27న రాత్రి భూపాలపల్లికి వెళ్లేందుకు భూత్పూర్ చౌరస్తాలో హైదరాబాద్ బస్సు కోసం వేచి ఉన్నాడు. ఇంతలోనే ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చి తాము హైదరాబాద్ వెళ్తున్నామని మల్లేష్‌కు చెప్పడంతో ఆయన కారులో ఎక్కాడు. మున్సిపాలిటీ సమీపంలోని శేరిపల్లి (బి) వద్ద మరో ఇద్దరు యువకులను కారులో ఎక్కించుకొని కొద్ది దూరం వెళ్లిన తర్వాత పొలాల్లోకి కారును మళ్లించి మల్లేష్‌ను స్క్రూ డ్రైవర్‌తో చంపుతామని బెదిరించి అతని వద్ద ఉన్న రూ.1500 లాక్కుని వెళ్లిపోయారు. మల్లేష్ కొత్త మొల్గరకు వచ్చి భార్య మంజులకు విషయాన్ని చెప్పి తిరిగి మల్లేష్ భూపాలపల్లికి వెళ్లిపోయాడు. గత నెల 30న మంజుల భూత్పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, నవీన్ చౌరస్తాలోని నిఘా కెమెరాల ఆధారంగా టీఎస్06 ఈఎఫ్6219 నంబరు గల కారులో మల్లేష్‌కు ఎక్కించుకున్నట్లు గుర్తించారు. కారు నంబరు ఆధారంగా కారు యజమాని ఆబిద్‌ను విచారించగా మతిన్ ద్వారా వీరెందర్ రూ.2వేలకు అద్దెకు తీసుకున్నారని, వీరెందర్ అలియాస్ చిన్నను విచారించగా రవికాంత్, సంతోష్, జైపాల్ కలిసి నేరం ఒప్పుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. బుధవారం వీరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై దృష్టి

జడ్చర్ల: చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఎస్పీ నర్సింహ తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగర్ కాలనీలో మంగళవారం పట్టుబడిన పేలుడు పదార్థాల ఘటనలో నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. వడ్డె బాలయ్యకు చెందిన గుడిసెలో 2,075 జిలెటిన్ స్టిక్స్, 2,774 డిటోనేటర్లను స్వాధీనపర్చుకున్నామని, వీటి విలువ రూ.5 నుంచి 6 లక్షల దాక ఉంటుందన్నారు. అక్రమంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్న వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం రాంపురం చెందిన మిద్దె రాజేష్, నల్లగొండ జిల్లా చిత్తనూరుకు చెందిన రూపాని సోమయ్యలను అరెస్ట్ చేశామని మరోఇద్దరు నిందితులు అనంతపూర్ జిల్లా కదిరి మండలం వడ్డెపల్లికి చెందిన మల్లెల రమేష్, కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లి చెందిన గణేష్ పరారీలో ఉన్నారని తెలిపారు.

జములమ్మ ఉత్సవాల్లో ఘర్షణ

- లాఠీచార్జ్ చేసిన పోలీసులు

గద్వాల క్రైం: జములమ్మ ఉత్సవాల్లో భాగంగా పుట్టినిల్లయిన గద్వాల మండలం గుర్రంగడ్డ నుంచి బుధవారం మెట్టినింటికి ఆలయ కమిటీ, భక్తులు జములమ్మ ఆలయానికి ఊరేగింపుగా ఎద్దుల బండిపై తీసుకొస్తూ ఊరేగింపు చేశారు. ఈ క్రమంలో జమ్మిచేడులోని వీధుల నుంచి భక్తుల కోలాహలం మధ్య ఉదయం ఓ ప్రార్థనా మందిరం వద్ద ఎవరికీ ఇబ్బందులు కలగకుండా డీజెలను నియంత్రించి ముందుకు వెళ్లాల్సిందిగా కొందరు నిర్వాహకులను కోరారు. దీంతో అక్కడి కొంత వివాదం చోటు చేసుకుంది. గుర్తించిన పోలీసులు ఇరు వర్గలకు రిని శాంతిపజేసి ముందుకు కదిలించారు. కొద్ది దూరం తర్వాత రోడ్డుపైకి వచ్చిన క్రమంలో రెండు వర్గాల మధ్య మరోమారు వివాదం చోటు చేసుకుంది. పోలీసులు వారిని శాంతిపజేసే క్రమంలో పరిస్థితి చేయి దాటి పోయింది. అప్పిటికే మద్యం మత్తులో ఉన్న కొందరు ఆకతాయిలు దాడి చేసేందుకు కదిలారు. చేసేదేమి లేక లాఠీచార్జ్ చేసి చెదరగొట్టారు. అనతంతరం జములమ్మ విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్ఠించారు. సంఘటనపై సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఊరేగింపులో కొందరు అకారణంగా వాగ్వివాదానికి పాల్పడ్డారు. దీంతో రెండు వర్గాల చెందిన వారు ఘర్షణకు దిగారు. వారిని నియంత్రించే క్రమంలో ఆకతాయిలను చెదరగొట్టాం. బాధ్యులైన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

వైభవంగా హంసవాహన సేవ


ఉత్సవమూర్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండలో బ్రహ్మోత్సవాల సందర్భంగా లక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి హంసవాహనసేవ కార్యక్రమం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శోభయమానంగా అలంకరించిన హంసవాహనంపై స్వామివారిని గర్భగుడి నుంచి దేవస్థానం ముందున్న మండపం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. బంగారు ఆభరణాలు, వివిధ రకాల పూల అలంకరణల మధ్య హంసవాహనంపై ఊరేగుతూ భక్తకోటికి దర్శనమిచ్చారు. అనంతరం స్వామివారిని గర్భగుడిలోకి తీసుకెళ్లి అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి అర్చకులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి స్వామివారి గజవాహన సేవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

మహవీర్ పరిశ్రమ పరిశీలన

బాలానగర్: మండలంలోని గుండేడ్ శివారులోని మహవీర్ పరిశ్రమలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి విద్యులత, ముగ్గురు అధికారులు బుధవారం తనిఖీ చేశారు. వాయుకాలుష్యంపై శాంపిల్స్ సేకరించారు. పరిశ్రమలో వెదజల్లే వాయు కాలుష్యంపై పరీక్షలు నిర్వహించారు. కాలుష్యంపై వివరాల సేకరణకు తమ ఉన్నత అధికారి ఈఈ సంగీత ఆదేశాల మేరకే వచ్చామని పూర్తి వివరాలు మాట్లాడడానికి వారు నిరాకరించారు. ఈ విషయంపై గ్రామ వార్డు సభ్యుడు నర్సింహులు మాట్లాడుతూ మహవీర్ పరిశ్రమలో పొల్యూషన్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. బుధవారం వచ్చిన అధికారులు పరిశ్రమను నడిపించకుండానే పరీక్షలు నిర్వహించారని, ఇలాంటి అధికారులు ఉంటే తమకు న్యాయం ఏ విధంగా లభిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.
ఈ విషయంపై ఈఈ సంగీతను వివరణ కోరగా గతంలో సర్పంచ్ నర్సింహారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నామన్నారు. అక్కడ గాలిలోని రేణువుల శాతం సేకరించడానికే పీసీబీ అధికారులను వరంగల్ నుంచి పంపామని ఆమె పేర్కొన్నారు. పూర్తి నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

బీజేపీ మోసానికి గుణపాఠం చెబుతాం

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



వనపర్తి క్రైం: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ మోసానికి భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెబుతామని ఎమ్మార్పీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అనాథలను ప్రభుత్వ బిడ్డలుగా గుర్తించి అన్ని విధాలుగా ఆదుకుంటామని సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలన్నారు. తల్లిదండ్రులు కోల్పోయిన పిల్లలు రాష్ట్రంలో దాదాపు 10లక్షల మంది ఉన్నారని, వీరి విషయంలో కేసీఆర్, మంత్రి వర్గం తీసుకున్న ఏ ఒక్క నిర్ణయం అమలు కాలేదన్నారు. ఇప్పటివరకు ఏ ఒక్క అనాథ శ్రమాన్ని కూడా సందర్శించలేదని విమర్శించారు. అనాథల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని చెప్పి మోసం చేశారని, చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడంలో బీజేపీ పూర్తిగా విఫలం చెందిందని, యావత్ ఎస్సీ వర్గాన్ని మోసం చేసిందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ రాజేష్, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కార్తీక్, చెన్న కేశవులు, లక్ష్మయ్య, నరసింహ, జగదీష్, నాగరాజు తదితరులు ఉన్నారు.

కళకళలాడిన ఉల్లి మార్కెట్

దేవరకద్ర: పట్టణంలోని మార్కెట్‌యార్డులో బుధవారం రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి కుప్పలతో కళ కళలాడింది. వారానికి ఒక సారి నిర్వహించే వేలం కోసం వివిధ గ్రామాల నుంచి రైతులు పెద్ద ఎత్తున రావడంతో మార్కెట్ అంతా సందడిగా మారింది. దాదాపు వెయ్యి బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. ప్రస్తుతం సీజన్‌కు సంబంధించి ఉల్లి దిగుబడులు ప్రారంభమయ్యాయి. రైతులు కోతలు కోసిన ఉల్లిని నేరుగా మార్కెట్‌కు తెస్తున్నారు. ఉల్లిని ఆరబెట్టకుండ అలాగే తేవడం వల్ల ధరలు తక్కువగా నమోదు అవుతున్నాయి. తెల్లగా ఉన్న ఉల్లి క్వింటాల్ గరిష్టంగా ధర రూ.1,600, కనిష్టంగా రూ.1,500 వరకు వచ్చింది. ఎర్ర ఉల్లికి డిమాండ్ తక్కువగా ఉన్నందున గరిష్టంగా రూ.1,200, కనిష్టంగా రూ. 850 వరకు ధరలు వచ్చాయి. మార్కెట్‌లో 45 కేజీల తెల్ల ఉల్లి బస్తా రూ. 750 నుంచి రూ. 800 వరకు విక్రయించారు. ఎర్ర ఉల్లిని రూ.450 నుంచి రూ.600 వరకు విక్రయించారు.